

# నేడు టిటిడి పాలకమండలి

**ప్రజాశక్తి - తిరుమల**

శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం తిరుమల అన్నమయ్య భవన్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ఛైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన పాలకమండలి సమావేశం జరగనుంది. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, సిఎం పట్టువస్త్రాలపై ప్రధానంగా చర్చ ఉంటుంది. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 24వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారి పట్టు వస్త్రాలను సిఎం చంద్రబాబునాయుడు దంపతులు సమర్పించనున్నారు. 28వ తేదీ కీలక ఘట్టమైన శ్రీవారి గరుడ వాహన సేవ ఉంటుంది.భక్తుల రద్దీకి అనుగుణంగా చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై ఈ సమావేశంలో చర్చ ఉంటుంది. మరికొన్ని కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు.



# తిరుపతిలో ఇంటి'గ్రేట్' మోడల్ బస్‌స్టేషన్

- రూ.500 కోట్లతో త్వరలోనే శ్రీకారం
- ప్రస్తుత బస్‌స్టేషన్ పూర్తిగా కూల్చివేత
- 13 అంతస్తులతో భారత్‌లో నంబర్1
- పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మాణం
- మరో ఆరు నెలల్లో సిఎంచే భూమిపూజ
- శ్రీవారి చెంత 'ఏడుకొండల' ఆకారంలో..



కూల్చివేస్తున్న బస్టాండ్

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాకారంతో తిరుపతిలో ఇంటిగ్రేట్ మోడల్ బస్‌స్టేషన్ రూపుదిద్దుకోనుంది. 13 అంతస్తులతో భారత్‌లోనే నంబర్ 1గా రూ.500 కోట్లతో పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న బస్‌స్టేషన్‌ను పూర్తిగా కూల్చివేసి, ఆ స్థానంలో ఈ మోడల్ బస్‌స్టేషన్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా మరో ఆరు నెలల్లో భూమిపూజ చేయనున్నారు. నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజిమెంట్ లిమిటెడ్, నేషనల్ హైవే అథారిటీ జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టు నిర్మించనున్నారు. ఈ మేరకు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ ఈ కంపెనీలతో ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న చోటే 13 ఎకరాల్లో ఏడుకొండల ఆకారంలో 9 లక్షల 94వేల 896 చదరపు అడుగుల్లో ఇంటిగ్రేట్ మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణం జరగనుంది. ఈ నిర్మాణం పూర్తయితే 1500 బస్సులు ఆగే వీలు ఉంటుంది.

**రూ.500 కోట్లతో నిర్మాణం**

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలోనే తిరుపతిలో ఇంటిగ్రేట్ మోడల్ బస్‌స్టేషన్ నిర్మించాలని తలిచారు. ప్రస్తుత ఎంపి ఎం.గురుమూర్తి హయాంలోనే మ్యాప్‌ను రూపొందించారు. అప్పట్లో ఏడు అంతస్తులే నిర్మించాలని ప్రతిపాదన ఉండగా, రోజురోజుకూ తిరుపతికి వస్తున్న భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో లక్ష మంది భక్తులకు తగినట్లుగా నిర్మించాలని కూటమి ప్రభుత్వం మ్యాప్‌ను మార్పు చేసింది. నిర్మాణ వ్యయం మరో వంద కోట్లు పెరగవచ్చని అంచనా.

**13 అంతస్తుల్లో మోడల్ బస్‌స్టేషన్**

శ్రీవారి చెంత నిర్మించే ఈ బస్‌స్టేషన్‌లో 13 ఎకరాల్లో 13 అంతస్తుల్లో నిర్మించనున్నారు. మొదట్లో 15 అంతస్తులు నిర్మించాలని అనుకున్నా, మున్సిపల్ కార్పొరేషన్ ఆక్షేపణ చెప్పడంతో 13కే కుదించారు. గ్రౌండ్‌ఫ్లోర్ మూడుగా ఉంటుంది. ఆపైన పది అంతస్తులు ఉంటాయి. పదో అంతస్తులో 'హెలిప్యాడ్'ను ఏర్పాటు చేయనున్నారు. రెండు సెల్లార్లలో వాహనాలు, టువీలర్లు పార్కింగ్ ఉంటుంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో వెయిటింగ్,టికెట్లు, విచారణ కేంద్రం ఉంటాయి. మొదటి అంతస్తులో ప్రయాణికులు నిరీక్షించే స్థలం, టాయిలెట్లు, ఎపిఎస్‌ఆర్టీసీ ఆఫీసు, వసతి, క్లాక్‌రూమ్, డార్మెటరీలు ఉంటాయి. రెండో అంతస్తులో షాపులు, ఫుడ్‌కోర్టు, ఎపీఎస్‌ఆర్టీసీ ప్రధాన కార్యాలయం ఉంటాయి. మూడో అంతస్తులో సర్వీస్ ఫ్లోర్, నాలుగు, ఐదు, ఆరు, ఏడో అంతస్తుల్లో



హెటల్స్, డార్మెటరీలు ఉంటాయి. ఎనిమిది, తొమ్మిదిలో కమర్షియల్ ఫ్లోర్, పదిలో హెలిప్యాడ్ ఉంటాయి.

**ప్రస్తుత బస్టాండ్ కూల్చివేత**

ప్రస్తుతం ఉన్న సెంట్రల్ బస్‌స్టేషన్‌ను అంచెలంచెలుగా నెలరోజులుగా జేసీబీలతో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పరదాలు కట్టి కూల్చివేస్తున్నారు. రెండు నెలల్లో నాలుగు బస్‌స్టేషన్లను, గ్యారేజీ, పార్కింగ్ స్థలం, షాపింగ్ కాంప్లెక్స్, డిఎం, ఎటిఎం కార్యాలయం, ఆర్‌ఎం కార్యాలయాలను పూర్తిగా తొలగిస్తారు. వీరికి ప్రత్యామ్నాయంగా అంతరాష్ట్ర బస్సులు, లోకల్ బస్సులు స్టాపింగ్ కోసం నగరంలో స్థలం లేకపోవడంతో గరుడ వారధి దిమ్మెలు నిర్మించిన స్థలంలోనే అగ్రహారం సర్కిల్లో తాత్కాలిక బస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అలాగే డిఎం, ఆర్‌ఎం కార్యాలయాలను అలిపిరిలోని పాత ఎస్వీబీసీ కార్యాలయం, శ్రీనివాసం కాంప్లెక్స్‌లోని డ్రైవర్ల విశ్రాంతి కార్యాలయం, తిరుచానూరు సమీపంలోని అర్బన్‌హాట్‌ను ఆనుకుని ఉన్న మహిళా ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు యోచిస్తున్నారు.

సాధికారత 'కల' సాకారానికి..



# కలసి నడుద్దాం

## మహిళా సదస్సులో గవర్నర్
## తిరుపతి వేదికగా జాతీయ సదస్సు సక్సెస్

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

మహిళా సాధికారతతో లింగ సమానత్వం సాధ్యమని, రాజ్యాంగంలోనూ లింగ సమానత్వానికి ప్రాధాన్యత ఉందని జాతీయ సదస్సులో గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. సాధికారత కల సాకారానికి కలసి నడుద్దాం అన్నారు. మహిళలు చట్టసభల్లోకి వస్తే విధానపరమైన నిర్ణయాల్లో సమాన భాగస్వామ్యం ఉంటుందని అభిప్రాయపడ్డారు. మహిళా సాధికారత సదస్సు ముగింపు సమావేశానికి రాష్ట్ర గవర్నర్ రెండో రోజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1997, ఏప్రిల్ 29న 11వ లోక్‌సభలో ఏర్పాటు చేసిన మహిళా సాధికారత కమిటీ, దేశంలో మహిళా సాధికారతకు ఒక ప్రధాన మైలురాయిగా నిలిచిందన్నారు. ఈ కమిటీ చేసిన సూచనలు, ప్రభుత్వ విధానాల రూపకల్పనలో, సమాజంలో సార్వత్రిక మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాయన్నారు. మహిళా సాధికారత అంటే కేవలం మహిళల కోసమే కాదని, అది సమాజమంతటికీ విముక్తి ప్రసాదించే వాగ్దానం అన్నారు. మహిళలు ఎన్నో సవాళ్లను ఎదుర్కొని రాజకీయ, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో పురుషులకు దీటుగా నిలుస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక తీర్పుల్లోనూ మహిళా హక్కులు కాపాడేలా అనుకూల తీర్పులు ఇచ్చిందని గుర్తు చేశారు. సమాజ నిర్మాణానికి మహిళలే సరైన ఆర్కిటెక్ట్‌లన్నారు.

**తిరుపతి సదస్సు చారిత్రిక ఘట్టం**
**హరివంశ్, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్**

రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ 1997లో ఏర్పాటైన మహిళా సాధికారత కమిటీ 28 సంవత్సరాల తరువాత మొదటిసారిగా ఇంత విస్తృత స్థాయిలో సమావేశం జరగడం చారిత్రక ఘట్టమన్నారు. ఒక మహిళ విద్యావంతురాలైతే ఒక తరం విద్యావంతమవుతుంది అని సావిత్రిబాయ్‌పూలే చెప్పిన మాటలు ఇప్పటికీ సత్యమేనన్నారు. రాజ్యాంగ సభలో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా హక్కుల కోసం పోరాడి పురుషుల కంటే మంచి నిర్వాహకులు అని అప్పుడే నిరూపించారన్నారు.

**చర్చలు బలమైన పునాది వేశాయి : పురంధేశ్వరి, కమిటీ ఛైర్‌పర్సన్**

సాధికారత కమిటీ ఛైర్‌పర్సన్ పురందేశ్వరి మాట్లాడుతూ జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్, కొత్తగా ఎదుగుతున్న టెక్నాలజీల సవాళ్లను ఎదుర్కోవడానికి మహిళలను సాధికారపరచడం అనే విషయం ప్లీనరీ సెషన్లలో జరిగిన చర్చలు లోతైన, దూరదష్టి గల ఫలితాలను ఇచ్చాయన్నారు.

**సదస్సు చేసిన తీర్మానాలు**

డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ ద్వారా భారతదేశం డిజిటల్ పరివర్తన కోసం కృషి చేస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్‌చెయిన్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, డేటా విశ్లేషణ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల సవాళ్లు, సురక్షితమైన ఉపయోగం గురించి మహిళలకు అవగాహన కల్పించాలి. అన్ని వయస్సుల మహిళల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహించడం. సైబర్‌నేరాలు, మోసాల గురించి అవగాహన కల్పించాలి. సైబర్ స్పేస్‌ను సురక్షితంగా ఉపయోగించుకునేలా శిక్షణ ఇవ్వడం. జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్ పై కొన్ని నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నామన్నారు.

**మహిళా సాధికారత కలకాదు..సత్యం : చింతకాయల అయ్యన్నపాత్రుడు, స్పీకర్**

అందరం కలిసి నడిస్తే మహిళల సాధికారత కలకాదని, త్వరలోనే సత్యం అవుతుంది. రెండు రోజుల పాటు తొలి మహిళా సాధికారతపై పార్లమెంట్, శాసనసభ కమిటీల జాతీయ సదస్సు విజయవంతంగా పూర్తవడంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు. చర్చలు, పంచుకున్న అనుభవాలన్నీ కలిపి కొత్త దిశ, కొత్త ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి. మహిళల సమానహక్కులు, రాజకీయాల్లో మరింత ప్రాతినిధ్యం, విద్య, ఉపాధి, ఆర్థిక రంగాలలో అవకాశాలు. ఇవన్నీ కేవలం నినాదాలు కావు, అందరం కలిసి సాధించాల్సిన లక్ష్యాలు.

ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూళ్ళూరుపేట, పుట్టపర్తి జిల్లాల ఎమ్మెల్యేలు, నెలవల విజయశ్రీ, పల్లె సింధూరా రెడ్డి, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, తిరుపతి బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ పాల్గొన్నారు. అనంతరం రెండు రోజుల పాటు సదస్సుకు హాజరైన వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా ప్రతినిధులకు కలంకారి చీరలు, శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి ప్రసాదాలను శ్రీ కాళహస్తి ఎం.ఎల్.ఏ బొజ్జల సుదీర్ రెడ్డి, వారి సతీమణి తో కలిసి అందజేశారు.

# బ్రహ్మశ్రీ గురూజీ ఆశ్రమంలో మారిషస్ పిఎం దంపతులు

**ప్రజాశక్తి - రామచంద్రాపురం**

శ్రీ బ్రహ్మర్షి గురూజీ సిద్దేశ్వర తీర్థ ఆశ్రమ పీఠాధిపతి శ్రీ బ్రహ్మర్షి గురువానంద గురూజీ ఆశీర్వాదంతో మారిషస్ దేశానికి నాలుగవసారి ప్రధానమంత్రి అయ్యానని మారిషస్ ప్రధానమంత్రి డాక్టర్ నవీన్ చంద్ర రామ్ గులాం అన్నారు. సోమవారం తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం, సి రామాపురం సమీపంలో శ్రీ బ్రహ్మర్షి గురూజీ సిద్దేశ్వర తీర్థ ఆశ్రమాన్ని మారిషస్ ప్రధానమంత్రి డాక్టర్ నవీన్ చంద్ర రామ్ గులాం, వీణా రామ్ గులాం దంపతులు సందర్శించారు. ఈ



సందర్భంగా ప్రధానమంత్రి దంపతులకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, శ్రీ బ్రహ్మర్షి గురువానంద గురూజీ, ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్, తిరుపతి ఎంపీ గురుమూర్తి, తెలంగాణ రాజ్యసభ సభ్యులు రవిచంద్రారెడ్డి, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, రాష్ట్ర హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు మంగళ వాయిద్యాలు, పుష్పగుచ్చాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గురూజీ ఆశ్రమం నుండి మారిషస్ ప్రధానమంత్రి దంపతులు తిరుమల శ్రీవారి దర్శనానికి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఆర్డీవో రామ్మోహన్ వీడ్కోలు పలికారు.

# మోక్షగుండం సేవలు ఆదర్శనీయం



గూడూరులో ఇంజనీర్లను సత్కరిస్తూ..

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ**

సమాజాభివద్ధికి మోక్షగుండం విశ్వేశ్వరాయ సేవలు ఆదర్శనీయమని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు పేర్కొన్నారు. ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరాయ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి సంతోష రావు మాట్లాడుతూ ఇంజనీరుగా భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరాయ అనేక నిర్మాణాత్మక పనులను చేపట్టి ప్రజల మదిలో శాశ్వతంగా నిలిచారన్నారు. పేద కుటుంబంలో జన్మించినప్పటికీ ఆయన నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తూ సమాజాభివృద్ధిలో మరపురాని పాత్రను పోషించారన్నారు. పనినే దైవంగా భావిస్తూ, రోజుకు 18 గంటలపాటు పనిచేసిన ఆయనను ఆప్పట్లో భారత ప్రభుత్వం భారతరత్న బిరుదుతో గౌరవించడం గొప్ప విషయమన్నారు. నేటి ఇంజనీర్లు మోక్షగుండం అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్/ ప్రాజెక్ట్స్ పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్డి) ఎన్. శోభా వాలెంటీనా, జనరల్ మేనేజర్లు రామచంద్రరావు, కృష్ణా రెడ్డి పాల్గొన్నారు. ఎపిఎస్ఇబి ఇంజనీర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అసోసియేషన్ అతిథి గృహ ప్రాంగణంలో మోక్షగుండం విగ్రహాన్ని ఎపిఎస్పిడిసిఎల్ సీఎండి కె. సంతోషరావు, పూర్వపు సిఎండిలు కలాల రంగనాధం, పంగూరు గోపాల్ రెడ్డిలు ఆవిష్కరించారు.

– గూడూరులో పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయంలోఈఈ బి.రమణయ్య మాట్లాడుతూ భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు. భారతదేశమే కాక



ప్రపంచ దేశాల్లో నూతనసాంకేతికను అందించిన గొప్ప ఇంజినీర్ అని అన్నారు. నేటి యువ ఇంజినీర్లు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతిభ కనిపించిన 12 మంది ఇంజినీర్లను సన్మానించారు.

– తిరుపతి – కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్‌డే వేడుకలను నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ బృహత్తర కట్టడాలను నిర్మించి భావితరాలకు అందించారన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వాసు, సివిల్ విభాగ అధిపతి బి.బాలకష్ణభరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

# సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

## కలెక్టరేట్ వద్ద ఆటోడ్రైవర్ల నిరసన

**ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)**

ఓలా, ఉబర్, ర్యాపిడో సంస్థలు రద్దు చేసి ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం వాహన మిత్ర పథకం ద్వారా రూ.15000 రూపాయల నుంచి 25 వేలకు పెంచుతూ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అందరి కార్మికులకు వాహన మిత్ర వర్తింపుచేయాలని కోరుతూ సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్టియు అనుబంధ ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కేతారి రాధాకష్ణ, ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్. జయచంద్ర, ఐఎఫ్టియు నగర కార్యదర్శి లోకేష్, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి శివ, విజయ్ కుమార్, బివి రమణయ్య, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, ఎన్ చంద్రశేఖర్ రెడ్డి నగర కార్యదర్శి ఎన్ డి రవి తదితరులు పాల్గొని తమ డిమాండ్ల సాధన కోసం నినాదాలు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు అనంతపురం సభలో ప్రతి ఆటో కార్మికుడికి రూ.15 వేల రూపాయలు ఇస్తామని ప్రకటించారని, అటు



తరువాత తీరుతెన్నులను పరిశీలిస్తే కేవలం 2.90 లక్షల మందికి మాత్రమే వర్తింపచేసేలా కార్యచరణ రూపొందించి రూ.470 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే ఆటో కార్మికులు 13 లక్షల 25 వేల మంది ఉన్నారన్నారు. వీరందరికీ ఈ పథకం కింద డ్రైవర్ కం ఓనర్, డ్రైవర్లు ఎక్కువమంది వర్తింప చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పురుషోత్తం రెడ్డి, వాసు, బాదుల్లా గోపి, దీప, కుమార్, రాము, ప్రసాద్, వెంకటేష్, సురేష్, వెంకటేష్, సతీష్, ప్రమీల, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్వీయూలో అడుగడుగునా ఆంక్షలు

**ప్రజాశక్తి - క్యాంపస్**

విద్యార్థిసంఘాలకు వ్యతిరేకంగా ఎస్వీయూలో అడుగడుగునా ఆంక్షలు విధించడం న్యాయం కాదని, తమకు కనీసం కుర్చీలు కూడా ఇవ్వరాదన్న వీసీ నిర్ణయాన్ని నిరసిస్తూ పరిపాలనా భవనం ముదే కింద కూర్చుని రౌండ్‌టేబుల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. విద్యాసంస్థల్లో ప్రైవేట్ వ్యక్తులు ఎటువంటి ప్రోగ్రాములు నిర్వహించరాదన్న ఉత్తర్వులు నిరసిస్తూ విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం ఉంటుందని నేతలు ముందే ప్రకటించారు. అయితే సెమినార్‌హాలు, ఆడిటోరియం, సెనెట్ హాలులో ఎటువంటి అనుమతి ఇవ్వొద్దని వీసీ ఆదేశాలు ఇస్తూ నిర్బంధం విధించడాన్ని విద్యార్థిసంఘాలు ఖండించాయి. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో–కన్వీనర్ అశోక్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, కార్యదర్శి రవి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉదయ్, ఐసా జిల్లా కార్యదర్శి చిన్నా, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి జెన్నె మల్లికార్జున, పీడిఎస్‌యు జిల్లా కార్యదర్శి లోకేష్, జిఎన్ఎస్ వ్యవస్థాపకుడు శివశంకర్‌నాయక్, జైభారత్ నేషనల్ పార్టీ రాయలసీమ కన్వీనర్ భార్గవ్ మాట్లాడుతూ యూనివర్సిటీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇన్‌ఛార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారన్నారు. అప్రజాస్వామిక ఉత్తర్వులు వెనక్కి తీసుకునేంత వరకూ దశలవారీగా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం వీసీ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. వీసీ అప్పారావు పాత విధానంలోనే సెమినార్ హాల్స్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థిసంఘాలు హర్షం ప్రకటించాయి. నాయకులు రెడ్డికుమార్, వినయ్, శివబాలాజీ పాల్గొన్నారు.



# మిగిలిపోయిన శెట్టిపల్లి ప్లాటుదారులకు న్యాయం చేస్తాం : ఆర్డీవో

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

శెట్టిపల్లి భూముల్లో మిగిలిపోయిన ప్లాటుదారులకు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని తిరుపతి ఆర్ డి ఓ హామీ ఇచ్చారు. బాధితులు తిరుపతి ఆర్ డి వో ఆఫీస్ వద్ద తమకూ కనీసం రెండు సెంట్లు ప్లాట్లు ఇచ్చి న్యాయం చేయాలని సోమవారం ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్ చర్చల సందర్భంగా శెట్టిపల్లికి సంబంధించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఆనాటి జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న స్పష్టంగా హామీ ఇచ్చారన్నారు. డబల్ రిజిస్ట్రేషన్ జరిగి మోసపోయి ఉన్నప్పటికీ వారికి న్యాయం చేయడం తమ ధర్మం అని తెలిపారని గుర్తు చేశారు.. లక్షలాది రూపాయలు రిజిస్ట్రేషన్ రూపంలో ప్రభుత్వానికి చెల్లించి ఉన్నారన్నారు .ప్రభుత్వం తరపున పత్రికలో ఇచ్చిన నోటిఫికేషన్‌లో వారు అనుభవంలో ఉన్నట్టు పేర్లను ప్రకటించి ఉన్నారని, ప్రభుత్వం ఈ ఆధారాలను పరిగణలోకి



తిరుపతి ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తూ..

తీసుకొని ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని కోరారు. శెట్టిపల్లి ప్లాట్ల పోరాట కమిటీ అధ్యక్షులు ఏ. రాధాకృష్ణ మాట్లాడుతూ అందరికి న్యాయం జరిగితేనే ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలిపారు. ఈ పోరాటానికి ప్రొసీడింగ్ వచ్చిన ప్లాటుదారులు రైతులు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. ఆర్డిఓ స్పందిస్తూ గతంలోనే సిపిఎం నాయకులు ఈ సమస్యను తన దష్టికి తీసుకు వచ్చినట్లు చెప్పారు. చినబాబు, శ్రావణ్, రాజశేఖర్, మధుమోహన్, అమ్ములమ్మ, కుప్పమ్మ జయమ్మ, పాల్గొన్నారు.

# స్టోర్ హమాలీల కడుపు కొట్టొద్దు

## ఎస్పీడిసిఎల్ సిఎండికి సిఐటియు వినతి



ఎస్‌పిడీసీఎల్ సిఎండికి వినతిపత్రం ఇస్తూ..

**ప్రజాశక్తి - తిరుపతి సిటి**

గత మూడు దశాబ్దాలుగా కష్టాన్ని నమ్ముకుని జీవిస్తున్న స్టోర్ హమాలీల కష్టాన్ని దోచుకోడానికి కాంట్రాక్టు వ్యవస్థను తీసుకురావాలని ప్రయత్నం చేయడం దారుణమని, ఈ ప్రయత్నాన్ని ఆపేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్టోర్ హమాలీలు, కాంట్రాక్టు కార్మికులతోకలిసి సిఎండి సంతోషరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రతి ఏడాదీ ఎస్పీడిసిఎల్ సంస్థ అన్ని జిల్లాలలో స్టోర్ హమాలీలకు వారి సొసైటీకి నామినేషన్ ప్రాతిపదికన పనులు కేటాయిస్తోందన్నారు. వచ్చిన సొమ్మును హమాలీలు పంచుకుంటున్నారని, తమకు వేతనం కల్పించి రెగ్యులరైజ్ చేయాలని కోరుతుండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాంట్రాక్టర్లను ప్రవేశపెట్టాలని భావించడం అన్యాయమన్నారు. తక్షణం ఈ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. హమాలీ కార్మికుల కష్టాన్ని దోచుకోడానికి ఎంఎల్ఎలు తయారయ్యారని విమర్శించారు. చిత్తూరు, అనంతపురం ఎంఎల్ఎలు తమ అనుయాయులైన కాంట్రాక్టర్ల ద్వారా కార్మికుల కష్టంలో వాటాను కొట్టేయడానికి తయారయ్యారన్నారు. చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్ రియల్‌ఎస్టేట్ వ్యాపారిగా, కోటానుకోట్ల అధిపతిగా పేరు ఉందని, అంతటి సంపన్నుడు బరువులు ఎత్తే హమాలీల కష్టంలో వాటాకై కుట్రలు చేయడం అన్యాయమన్నారు. హమాలీ కార్మికుల కుటుంబాలు ఎంఎల్ఏను వేడుకుంటే వ్యంగ్యంగా ప్రవర్తించడం న్యాయమా అని ప్రశ్నించారు. స్టోర్ హమాలీల జోలికి వస్తే ఎంఎల్ఏకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కందారపు మురళితో పాటు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి శివప్రసాద్‌రెడ్డి, ఆరోగ్యదాస్, శ్రీనివాసరావు, చలపతి, ఎస్.సాబీర్, సిహెచ్ రాగయ్య, కేశవులు పాల్గొన్నారు

# తిరుపతికి 52 ప్రత్యేక రైళ్లు



**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో** దక్షిణ మధ్య రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది .. తిరుమల యాత్రికుల రద్దీ మేరకు మరిన్ని రైళ్లు నడపాలని భావించింది. తిరుపతి యాత్ర 52 రైళ్ల సర్వీసులు నడపాలని ఈ మేరకు ప్రకటించింది. విశాఖపట్నం–తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. విశాఖపట్నం–తిరుపతి స్పెషల్ ట్రైన్ ఈ నెల 15 నుంచి (సోమవారం) నవంబర్ 24 వరకు ప్రతి సోమవారం అందుబాటులో ఉంటుంది. అదే విధంగా, తిరుపతి–విశాఖపట్నం రైలును ఈ నెల 16 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి మంగళవారం నడపనున్నట్లు వివరించారు. ఈ మార్గంలో మొత్తం 22 సర్వీసులు నడుస్తాయి. ఇక, తిరుపతి–అనకాపల్లి–తిరుపతి మధ్య అక్టోబర్ 5 నుంచి అక్టోబర్ 27 వరకు మొత్తం 8 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, సంబల్‌పూర్–ఇరోడ్ మధ్య కూడా రైల్వే శాఖ ప్రత్యేక సర్వీసులను ప్రకటించింది. సంబల్‌పూర్ నుంచి ఇరోడ్ వెళ్లే రైలు సెప్టెంబరు 17 నుంచి నవంబర్ 26 వరకు ప్రతి బుధవారం ప్రయాణిస్తుంది. తిరుగు ప్రయాణంలో ఇరోడ్–సంబల్‌పూర్ రైలు సెప్టెంబరు 19 నుంచి నవంబర్ 28 వరకు ప్రతి శుక్రవారం సర్వీసు అందిస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గంలో కూడా మొత్తం 22 ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైల్వే శాఖ సూచించింది. విజయదశమి సందర్భంగా వరుస సెలవులు, శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు, విజయవాడ నవరాత్రి బ్రహ్మోత్సవాలు తదితర పండుగ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

# ఐసీడీఎస్ అధికారుల నిర్లక్ష్యం..

## అర్హత ఉన్నా దక్కని అప్ గ్రేడేషన్

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యం..అంగన్వాడీ కార్యకర్తల పాలిట శాపంగా మారింది. సకాలంలో విద్యార్హత సర్టిఫికెట్లను అప్ లోడ్ చేయకపోవడంతో మెయిన్ కార్యకర్తలుగా మారాల్సిన వారు మినీలుగానే మిగిలిపోయే ప్రమాదం ఏర్పడింది. ఈ విషయంపై శ్రీకాళహస్తి ఐసీడీఎస్ అధికారులను బాధిత అంగన్వాడీ కార్యకర్తలు నిలదీస్తే పొంతన లేని సమాధానాలు చెప్తుండటం గమనార్హం. వివరాల్లోకి పోతే... సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ వర్కర్ల సమరశీల పోరాటాల ఫలితంగా ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం మినీలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా మార్చేందుకు అంగీకారం తెలిపింది. అదే




క్రమంలో పదో తరగతి పాసైన మినీ కార్యకర్తలను మెయిన్ కార్యకర్తలుగా పదోన్నతి కల్పించేందుకు సుముఖత వ్యక్తం చేసింది. మినీ కేంద్రాలు మెయిన్ కేంద్రాలుగా అప్ గ్రెడేషన్ చేయడం వల్ల అర్హత ఉన్న ప్రతి మినీ కార్యకర్తకు రూ. 7 వేల నుంచి రూ. 11500కు వేతనం పెరగనుంది. ఆయా సహకారం కూడా దక్కుతుంది. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా 4,687 మినీ అంగన్వాడీలను మెయిన్ కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 39 మినీలను అప్ గ్రేడేషన్ కు పంపగా 34 కేంద్రాలకు మాత్రమే అర్హత దక్కింది. ఐదు కేంద్రాలను వివిధ కారణాలతో ప్రభుత్వం తిరస్కరించింది. శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని ఎల్లంపల్లి వైసీ, రాజుగుంట, తొట్టంబేడు మండలంలోని కొత్తకన్నలి, చియ్యవరం హెచ్ డబ్ల్యూ, శ్రీకష్ణాపురం మినీ కేంద్రాలు తిరస్కరణకు గురైన జాబితాలో ఉన్నాయి.ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తమకు అన్యాయం జరిగిందని బాధిత అంగన్వాడీ మినీ కార్యకర్తలు వాపోయారు. ఐదేళ్లకు ముందుగానే విద్యార్హత పత్రాలు పలు దఫాలుగా సమర్పించినా అధికారులు నిర్లక్ష్యం చేశారంటూ మండిపడుతున్నారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శాంతి దుర్గను వివరణ కోరగా ' సాంకేతిక కారణాల వల్ల మొదటి జాబితాలో అర్హత సాధించలేదు.. రెండో జాబితాలో న్యాయం చేస్తాం' అన్నారు.

## ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కు సన్మానం

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన వడమాలపేట మండలం బోయలగుడ్డ(నగరి పుత్తూరు) కు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ఎస్. మునిరత్నం సోమవారం టీడీపీ నాయకులతో కలిసి, తనకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సన్మాన సమావేశంలో టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్‌ఆర్‌పీగా సుబ్రహ్మణ్యం ఎంపిక



**ప్రజాశక్తి -ఏర్పేడు :** బండారుపల్లి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్లోపాధ్యాయుడుగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయులు రాజావేల్ తెలిపారు. గుంటూరు విట్ ఇంజనీరింగ్ కాలేజీలో జరుగుతున్న డీఎస్‌సి 2025, నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి సుబ్రహ్మణ్యంను రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా ఎంపికచేశారన్నారు.

## పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములుకండి

**ప్రజాశక్తి-ఏర్పేడు:** మండలంలోని డిక్సన్ కంపెనీ ప్రతినిధులతో టిడిపి మండల అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు సోమవారం భేటీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ వికృతమాల పంచాయతీ అభివృద్ధిలో డిక్సన్ కంపెనీ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు భూపతి నాయుడు పాల్గొన్నారు.

## రేపు స్త్రీ అవగాహన కార్యక్రమం

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** ఈఎస్‌ఐ ఆధ్వర్యంలో కార్మికులకు స్త్రీ-2025 అవగాహన కార్యక్రమం ఈనెల 17వ తేదీ నిర్వహించనున్నట్లు ఈఎస్‌ఐ తిరుపతి బ్రాంచ్ మేనేజర్ నాగమణి ప్రకటనలో తెలిపారు. తిరుపతి సమీపంలోని, గాజుల మండ్యం, మల్లాడి డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ భవనంలో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే కార్యక్రమానికి ఇన్స్యూరెన్స్ కమీషనర్ రేణుక ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈయనతో పాటు తిరుపతి ఈఎస్‌ఐ జాయింట్ కమిషనర్ రాధాకృష్ణ, పలువురు అధికారులు ప్రముఖులు హాజరవుతారని, ఈ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## రీ సర్వే వేగవంతం చేయండి

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** మండల పరిధిలోని 28 గ్రామ పంచాయతీలలో చేపట్టి భూ రీ సర్వే ముందుగా రైతులకు సమాచారం అందించి, వేగవంతం చేయాలని తహశీల్దార్ శ్రీదేవి రెవిన్యూ సిబ్బందిని కోరారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ వివాదాలు లేకుండా అధికారులు జాగ్రత్తలు పాటిస్తూ సర్వే సమాచారం ముందుగా రైతులకు అందించాలన్నారు. పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్ లో నమోదుచేయాలన్నారు. సర్వే తలెత్తిన సమస్యలపై కార్యాలయంలో రికార్డులు పరిశీలన చేసిన నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వీఆర్వోలు గ్రామ సర్వేలు పాల్గొన్నారు.


## గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** వానాకాలంలో ఆవులు, గేదెలకు గాలి కుంటు వ్యాధి సోకే అవకాశం ఉందని పశు సంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. ఆ వ్యాధుల నివారణకు టీకాలను వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 5 నెలల వయసు పైబడిన పశువులకు టీకాలు వేశారు. టీకాలు వేసిన పశువుల వివరాలు ఆన్‌లైన్ భారత్ పశుధన్ పోర్టల్లో నమోదు చేయనున్నారు. గూడూరు మండలం అర్బన్ పరిధిలో వార్డులో, నెల్లటూరు, కొండగుంట, తిప్పవరపాడులో 435 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. అనంతరం గాలి కుంటు వ్యాధిపై రైతులకు అవగాహన కల్పించినట్లు వెటర్నరీ ఏ.డి.ఏ డాక్టర్ సురేష్ తెలిపారు.

## అటవి భూముల్లోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు


**ప్రజాశక్తి - బాలాయపల్లి :** అటవి భూముల్లోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని వెంకటగిరి డిఆర్ సుహాసిని పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మన్నూరు, పల్లిపాడు గ్రామాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిజర్వు ఫారెస్ట్ భూముల్లో జెసిబీలు, ట్రాక్టర్లు ప్రవేశించినా, ఫారెస్ట్ భూములను ఆక్రమించిన చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. మన్నూరులో సర్వే నంబరు 92 లోని భూమి తమ పరిధిలో ఉందన్నారు. అదేవిధంగా పల్లిపాడులో సర్వే నంబరు 53, 54-20, 54-21, 55-2, 56-2, 59 లోని భూములు తమపరిధిలో ఉన్నాయన్నారు. అటవీ భూముల్లో వన్య ప్రాణులను వేటాడట వంటివి చేస్తే శిక్షార్హులు అవుతారన్నారు.

## ఏపీ టూరిజం డైరెక్టర్ గా మునిరత్నం



**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** వడమాలపేట మండలం పత్తిపుత్తూరు గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు సీఎం.మునిరత్నంను ఏపీ టూరిజం డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మునిరత్నం మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి ఇచ్చిన ఈ బాధ్యతను కత నిశ్శబ్దంతో నిర్వర్తిస్తాను, ఈ పదవి బాధ్యతలు రావడానికి కృషిచేసిన నగరి నియోజకవర్గ శాసనసభ్యులు భాను ప్రకాష్ కు ప్రత్యేక కతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పర్యాటకశాఖ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

## టీటీడీకి ఎలక్ట్రిక్ వాహనం విరాళం



**ప్రజాశక్తి - తిరుమల:** బెంగుళూరుకు చెందిన టివోల్ట్ ఎలక్ట్రిక్ వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.15,94,962 విలువైన మొట్ట ఎలక్ట్రిక్ ఏవియేటర్ వాహనాన్ని సోమవారం టీటీడీకి విరాళంగా అందించింది. ఆ సంస్థ ప్రతినిధులు శ్రీవారి ఆలయం ముందు వాహనానికి పూజలు నిర్వహించి తాళాలను శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## టీటీడీ ట్రస్టులకు రూ.20 లక్షల విరాళం



మంగళగిరికి చెందిన మన్యం శ్రీనివాసరావు, అరుణ దంపతులు తిరుమల క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడును కలిసి రూ.20 లక్షల విలువైన విరాళం డిడిలను అందజేశారు. కుమార్తెలు మన్యం హారిక పేరుపై ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10,00,116, మన్యం హరిత పేరుపై ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.10,00,116 విరాళం అందించారు.టీటీడీ బోర్డు సభ్యురాలు జానకీదేవి దాతలను అభినందించారు.

## వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలి




**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** వి.ఆర్ఏ లకు తెలంగాణ రాష్ట్రంలో అమలయ్యే విధంగా పే స్కేల్ జీతాలు అమలు చేయాలని గ్రామ సేవకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వర రావు, రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె.బంధకి సాహెబ్‌లు డిమాండ్ చేశారు. గూడూరు, సి. ఐ.టి. యు కార్యాలయం నుండి వి.ఆర్. ఏ లు ర్యాలీగా బయలుదేరి టవర్ క్లాక్ మీదుగా గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని ధర్నా చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సేవకుల జిల్లా కార్యదర్శి కొల్లపూడి సుబ్బయ్య అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా అమలు చేస్తున్న విధులను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ ఖాళీ పోస్టులలో వి.ఆర్.ఏ లకు 70 శాతం పోస్టులను ఇవ్వాలని, నామినీలను వీఆర్ఏలగా గుర్తించాలని, డిఏ ను జీతాల్లో కలపాలని, నైట్ వాచ్‌మెన్, అటెండర్ డ్యూటీలను నిలుపుదల చేయాలని కోరారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఏ.వో శిరీషకి వినతి పత్రం అందచేశారు. అనంతరం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో 14 మండలాల వి.ఆర్.ఏ లతో సమావేశం నిర్వహించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఈనెల 22 , 23 వ తేదీల్లో విజయవాడలో దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 24 న విజయవాడలో జరిగే ధర్నా లో వి.ఆర్.ఏలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివ కుమార్ కె.వి.పి.ఎస నాయకులు, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, పామంజి మణి, వి.ఆర్. ఏ మండల అధ్యక్షులు రామయ్య , వి.ఆర్.ఏ లు తదితరులు పాల్గొన్నారు.

## బాక్సింగ్ పోటీలకు వడమాలపేట విద్యార్థులు ఎంపిక

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** 13వ తేదీ శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిరుచానూరు వేదికగా ఉమ్మడి చిత్తూరు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బాక్సింగ్ అండర్ 14,17,19 బాల బాలికల జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్ సెక్రెటరీ డాక్టర్ బాబు, తిరుపతి జిల్లా సెక్రటరీలు కిషోర్ కుమార్, భార్గవి దేవి పర్యవేక్షించారు. ఈ ఎంపిక పోటీలకు హాజరైన వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ 14 కేటగిరిలో తనుష్ (8వ తరగతి) - 30 కిలోల విభాగంలో, వినయ్ కుమార్ (9వ తరగతి) - 46 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు అక్టోబర్ మొదటి వారంలో విజయనగరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణా నవనీతం, ఉపాధ్యాయులు అభినందించారు.

## రైఫిల్ షూటింగ్ పోటీలకు శ్రీ గాయత్రి విద్యార్థులు ఎంపిక



**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** ఎస్.జి.ఎఫ్.ఐ స్పోర్ట్స్‌లో భాగంగా జిల్లా స్థాయిలో గూడూరు, ఎస్ఎస్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన రైఫిల్ షూటింగ్ పోటీలలో అండర్ -14 విభాగంలో శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు తేజస్వి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, ఈప్సిత శ్రీ జిల్లా స్థాయిలో మూడవ స్థానం సాధించి, స్టేట్ మీట్ కి ఎంపిక అయినట్లు కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమములో పిడి కరిముల్ల, కోచ్ జయశంకర్, వ్యాయమ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టిటిడిలో బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** టిటిడిలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని తిరుపతి జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సెల్ సభ్యులు బాణావతి మునింద్రనాయక్, సరస్వతమ్మ కోరారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంగళవారం జరిగే టిటిడి ధర్మకర్తల మండలి సమావేశంలో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జిల్లా పరిధిలో ఆధార్ కార్డు లేని గిరిజనులకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆధార్ కార్డులు మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు.

## మరిన్ని సమాజ హితమైన రీల్స్ చేయండి: డైరెక్టర్స్

### రాష్ట్ర విజేతలుగా ఎమరాల్డ్స్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** సమాజ హితానికి అవసరమైన నేడు అభివృద్ధి చెందిన డిజిటల్ రంగంలో మార్పు కోసం ప్రయత్నం చేస్తూ రిల్స్ చేయాలని ఎమరాల్డ్స్ విద్యా సంస్థల సంచాలకులు గిరిధర్, విశ్వనాధ్ లు సూచించారు. సోమవారం ఇటీవల తెలంగాణ రాష్ట్రం వివేకానంద కేంద్ర, తెలుగు ప్రాంత్ వారు సంయుక్తంగా నిర్వహించిన రీల్స్ మేకింగ్ పోటీలలో తిరుపతి నరసింహతీర్థం మార్గంలోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల ద్వితీయ సంవత్సరం బీకాం విద్యార్థులు లాస్య ఆనంద్, గీత ఫరీక్, ప్రతిభ నాయుడు, శ్వేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజేతలుగా నిలిచారన్నారు. హైదరాబాద్ మెహదీపట్నం పుల్లారెడ్డి డిగ్రీ కళాశాలలో విజేతలకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ బహుమతి ప్రధానం చేశారన్నారు. ఇంతటి ఘనత సాధించిన కళాశాల విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామని కళాశాల డైరెక్టర్లు తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాఫర్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో సత్తా చాటిన అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల విద్యార్థులు



**ప్రజాశక్తి - క్యాంపస్ :** పరుల్ యూనివర్శిటీ సంవిధాన్ పే చర్చా-2025 జాతీయస్థాయిలో నిర్వహించిన మూట్కోర్ట్ ఫలితాలలో అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల విద్యార్థులు మొదటి రన్నరప్ ప్రైజ్తో పాటు క్యాష్ అవార్డును కైవసం చేసుకున్నారు. తమ కళాశాల నుంచి చిన్మయి, సాహితీ, హర్షిత పాల్గొని ఫస్ట్ రన్నరప్ ప్రైజులో లా కమిషన్ ఆఫ్ ఇండియా హానరబుల్ ఛైర్పర్సన్ జస్టిస్ దినేష్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిసింగ్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయకుమార్ శుక్ల చేతులమీదుగా ఈ అవార్డు అందుకున్నారు. జాతీయస్థాయిలో 110 కళాశాలల్లో పాల్గొన్న ఈ పోటీలలో అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి, మొదటి రన్నరప్ ప్రైజును అందుకున్నారని కళాశాల ఛైర్మెన్ డా. తిప్పారెడ్డి తెలియజేశారు. రీసెర్చ్ టెస్టులో సెకండ్ ప్రైజును హర్షిత కైవసం చేసుకున్నట్లు తెలిపారు.

## ప్రణాళిక బద్ధంగా జూ పార్క్ అభివృద్ధి



**ప్రజాశక్తి-తిరుపతి (మంగళం):** శ్రీ వెంకటేశ్వ ర జంతు ప్రదర్శన శాలను ప్రణాళిక అబద్ధంగా అభివృద్ధి చేస్తామని రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ అటవీశాఖ సలహాదారు మల్లికార్జున రావు తెలిపారు. సోమ వారం అలిపిరి - చెర్లోపల్లి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శన శాలను జిల్లా అటవీ శాఖ అధికారులతో కలిసి సందర్శించి, జూ అభివృద్ధికి చేయవలసిన కార్యక్రమాలను చర్చించారు. ఈ కార్యక్రమం లో తిరుపతి సర్కిల్ సిసిఎఫ్ సెల్వం ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వాతావరణ కాలుష్యంపై అవగాహన

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యధుమధి ఇంటిగ్రేటెడ్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ సొసైటికి చెందిన గీథిక వెంకటేసన్ కాలుష్యం, సోమవారం వాతావరణ మార్పుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణహిత ఉత్పత్తుల వాడకం, శిలాజ ఇంధనాల వాడకం తగ్గించడం, ప్రజా రవాణా వినియోగించడం, పరిశ్రమలలో వ్యర్థాలను నియంత్రించడం, వ్యర్థాలను కాల్చకుండా ఉండటం, నీటి వనరులను కలుషితం చేయకుండా చూసుకోవడం వంటి చర్యలు కాలుష్య రహిత సమాజానికి దోహదపడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ నారాయణ రాజు, డాక్టర్ కోటేశ్వరరావు, కిరణ్మయి, శ్రీధర్ శర్మ, డాక్టర్ ఝాన్సీ వాణి తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలి

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** విద్యార్థిదశనుంచే క్రీడలతో పాటు చదువులోనూ ప్రతిభ కలిగి ఉండాలని మండల విద్యాశాఖ అధికారి తిరుమల రాజు విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక ఎస్ఆర్ఎస్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎస్‌జిఎఫ్ మండల స్థాయి క్రీడాకారుల ఎంపికను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు డివిజన్ స్థాయిలో పాల్గొనాలని విజేతలవ్వాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 బాలసుబ్రమణ్యం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ రెడ్డి, సీనియర్ అధ్యాపకులు ఏకాంబర ఆచారి, ఎస్ఆర్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, మండల కో ఆర్డినేటర్ గోపీకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు జయప్రకాష్, గుర్రప్ప, వేలు, సుబ్రమణ్యం, కేశవులు, మోహన్, అరుముగం, షంషుద్దీన్, శివ, రాజశేఖర్. పాల్గొన్నారు.

## ఉబ్బలమడుగులో సిబ్బంది చేతివాటం

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** బుచ్చినాయుడు కండ్రిగ మండలం, వరదయ్యపాలెం, ఉబ్బలమడుగు జలపాతానికి తమిళనాడు నుంచి శని, ఆదివారాలలో వందల మంది వస్తుంటారు. వాటర్ ఫాల్స్ ఎంట్రన్స్ ఫీజు ఒకరికి 50 రూపాయలు, ఆటో, కార్లు, మినీ బస్సులు 150 నుంచి 500 వరకు ఇక్కడ వచ్చే వాహనదారులు రుసుం చెల్లించాలి. ఈ విధంగా వచ్చే రుసుము ప్రభుత్వానికి రెండు లక్షల నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు వస్తుందని అంచనా. కానీ ఇక్కడ పనిచేసే సిబ్బంది ఎంట్రన్స్ టికెట్లు ఇవ్వకుండా రుసుము వసూలు చేస్తూ, తమ జేబులు నింపుకోవడం ఇక్కడ జరిగే ప్రతిరోజు జరుగుతోందని పర్యాటకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తామని రాయలసీమ ప్రెస్ యూనియన్ అధ్యక్షులు, టీడీపీ నాయకులు వప్పతొట్టి రమేష్ బాబు తెలియజేశారు.

## మండల స్థాయి క్రీడా పోటీలకు ఎంపికలు

**ప్రజాశక్తి -ఏర్పేడు :** ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పోటీలకు అండర్ 14,17 బాల బాలికలకు కబడ్డీ, వాలీబాల్, కోకో పోటీలు టీములను ఎంపిక చేశారు. 18న పల్లం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అథ్లెటిక్స్, చెస్, బ్యాడ్మింటన్, యోగ పోటీలు టీములను ఎంపిక చేయనున్నట్లు ఎంవో ప్రేమలత, దయాకర్‌లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మంత్రి సవితమ్మను దూషించిన వారిని బహిష్కరిస్తున్నాం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** కులం పేరు అడ్డుపెట్టుకుని తన సొంత పనులకు కుల సభ్యులను వాడుకుంటూ అందలమెక్కిన జబ్బల శ్రీనివాసులును అక్టోబర్ 5న తిరుపతి సమీపంలో భక్త కనకదాస కాంస్య విగ్రహం ఆవిష్కరణకు బహిష్కరణ చేస్తున్నామని తిరుపతి జిల్లా కురువ, కురుబ సంఘం గౌరవ జిల్లా అధ్యక్షులు పోతప్ప స్పష్టం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి జ్ఞాపకార్థం మంత్రి సవితమ్మ అనేక కనకదాసు విగ్రహాలు రాయలసీమ ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి, ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతి, తిరుమలలో భక్త కనకదాసు పీఠం కోసం ప్రయత్నం కృషి చేస్తుంటే అటువంటి వ్యక్తిపై వ్యక్తిగత దూషణలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో కనక దాస విగ్రహ కమిటీ జిల్లా అధ్యక్షులు మంగిరి రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ అధికారులకు అభినందన

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** తిరుపతి, ఎస్ వి దివ్యారామం, నగర వనంలో నడకదారిని ఇతర అభివృద్ధి పనులను చేపట్టిన ఫారెస్ట్ అధికారులకు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరేంద్ర షటిల్ బృందం అభినందనలు తెలిపారు. గుంతలు పూడ్చడం, నడకదారి ఇరువైపుల బండలు అమర్చడం ఉపయోగకరంగా ఉందన్నారు. షటిల్ కోర్టులకు కూడా గ్రావెల్, ఇసుకను ఏర్పాటు చేయడం, లోటస్ పాండ్, తాబేళ్ల చెరువు చుట్టుపక్కల నడకదారిని వెడల్పు చేసి గార్డెన్ ఏర్పాటు చేస్తే మరింత సుందరంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## రేణిగుంట సిఐటియు మండల కన్వీనర్‌గా సెల్వరాజ్

**ప్రజాశక్తి - రేణిగుంట:** తిరుపతి జిల్లా, రేణిగుంట మండలంలో సిఐటియు మండల మహాసభ రేణిగుంట జి.యం.వీధిలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో సెల్వరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ మహాసభలో ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి జయచంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ, బిల్డింగ్ రంగం జిల్లా కార్యదర్శి మునిరాజా పాల్గొన్నారు. మండలంలో వివిధ రంగాల నుండి ప్రతినిధులు, అధ్యక్ష కార్యదర్శులు హాజరయ్యారు. అనంతరం రేణిగుంట సిఐటియు మండల కన్వీనర్ కమిటీ 21 మందితో ఎన్నిక జరిగింది. మండల కన్వీనర్ గా కాన్జేరి సెల్వరాజ్, కమిటీ సభ్యులుగా కొండ్రెడ్డి హరినాథ్, రాజశేఖర్ (బిల్డింగ్ రంగం), దీప (ఆటోరంగం), కె. ఈశ్వరమ్మ (శ్రామిక మహిళా రంగం), రవి (ఆటోరంగం), అమ్ములు (సి.ఆర్.ఎస్ రైల్వే రంగం), ధనమ్మ, అంబిక (అంగన్వాడి రంగం), లక్ష్మీ, మనీలా (సంఘమిత్ర), నారాయణ, మునిరాజా (ప్రైవేట్ స్కూల్ రంగం), శివ (అమాలి రంగం), పురుషోత్తం (ఆటో రంగం), రోసిరెడ్డి (వాల్టార్క్), మునికృష్ణారెడ్డి (మల్లాడి డ్రగ్స్), దస్తగిరి (లారీ రంగం), రామిరెడ్డి (నంది పాలిమర్స్), మస్తాన్ (మోటర్ మెకానిక్), కో ఆప్షన్ సభ్యుడు (గ్రామ పంచాయతీ కార్మికులు రంగం నుండి ఒక్కరు). ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, సత్య శ్రీ, భారతి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

## వాకాడు ఎంపీడీవోగా సాయిప్రసాద్ నియామకం



**ప్రజాశక్తి - వాకాడు:** తిరుపతి జిల్లా వాకాడు మండల ప్రజా పరిషత్ అభి వృద్ధి అధికారిగా సాయి ప్రసాద్ నియమితులయ్యారు. సాయి ప్రసాద్ నెల్లూరు జిల్లాలో ఈవోపీఆర్టీ (డిప్యూటీ ఎండిఓ)గా పనిచేస్తూ పదోన్నతిలో వాకాడు ఎంపిడిఓగా నియమితులయ్యారు. దాదాపు ఒకటిన్నర సంవత్సరంముగా ఎంపీడీవోగా ఇన్చార్జిలే కొనసాగుతున్నారు. ప్రస్తుతం పూర్తి బాధ్యతలతో ఎం సాయి ప్రసాద్‌ను నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

## మండలస్థాయి గ్రామీణ ఆటల పోటీలు

**ప్రజాశక్తి - పాకాల:** మానసిక, శారీరక ఉల్లాసానికి ఆటలు చాలా దోహదపడుతాయని తిరుపతి జిల్లా పాకాల మండల విద్యా శాఖాధికారులు బాబ్జి, లింగయ్యలు పేర్కొన్నారు. సోమవారం దామల చెరువు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సుమతమ్మ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి గ్రామీణ పోటీలను వారు ప్రారంభించారు. యమ్.ఈ ఓ.బాబ్జి మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి ఆటలు ఆరోగ్యానికి మంచివని తెలిపారు. లింగయ్య మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపితే భవిష్యత్తులో ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుందని చెప్పారు. ఈ పోటీలకు రూ.10,000 విలువ చేసే షీల్డ్స్, మెడల్స్ పత్తి పాటి వారిపల్లి, మహా ప్రస్థానం వ్యవస్థాపకుడు అనిల్ కుమార్ ఇవ్వడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 5 ఉన్నత పాఠశాలల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రవి



**ప్రజాశక్తి - చంద్రగిరి :** ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన ఉన్నం రవి వరుసగా నాలుగోసారి ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఆఫీసర్స్ క్లబ్లో సంఘం ఎన్నికలు (2025-28) ఏకగ్రీవం అయ్యాయి. చంద్రగిరి ప్రభుత్వ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న వి.రవి అధ్యక్షుడిగా, గుంటూరు జిల్లాకు చెందిన నాగరాజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మరో పదిమందిని వివిధ హోదాల్లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడు వి.గోపాల్రెడ్డి, చిత్తూరు జిల్లా కార్యవర్గ సభ్యులు రాజనాల, వంశీకృష్ణ, కిషోర్ కుమార్, రియాజ్, జిల్లా బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డిలు అభినందనలు తెలిపారు.

# క్రైం న్యూస్

## తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ



**ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ :** పుత్తూరు, ఆచారి వీధిలో నివసిస్తున్న వెంకట సాయి ప్రసాద్, మమతా దంపతులు శుక్రవారం ఇంటి తాళాలు వేసుకుని, కుటుంబ సమేతంగా తిరుమలకు వెళ్లారు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. గుర్తు తెలియని దుండగులు ఇంట్లో సామాన్లు చిందర వందరగా చేసి, సుమారు 30 సవరాలు బంగారు నగలు, రూ.1,10,000 పొదుపు నగదు దొంగిలించినట్లు బాధితులు తెలిపారు. ఈ సంఘటన స్థానికంగా ఆందోళనను రేకెత్తించింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీలతో ఆందోళన చెందుతున్న స్థానికులు రాత్రి వేళల్లో పోలీసులు గస్తీని మరింత పెంచి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## 21ఎర్రచందనం దుంగలు, 3 కార్లు స్వాధీనం.. స్మగ్లర్ అరెస్ట్





**ప్రజాశక్తి - మంగళం :** తిరుపతి, కరకంబాడి రోడ్డులోని టీఎన్ పాళెం అటవీ ప్రాంతంలో మూడు కార్లలో లోడ్ చేస్తున్న ఎర్రచందనం చెట్ల వేర్లతో సహా 21 దుంగలను పట్టుకుని, మూడు కార్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక స్మగ్లరును అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ కార్యాచరణలో భాగంగా, డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గనిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిధర్ అధ్వర్యంలో విష్ణుకుమార్ టీమ్ ఆదివారం అటవీ సిబ్బంది చైతన్య, కిషోర్‌లతో కలిసి మామండూరు నుంచి కరకంబాడి మీదుగా అడవిలో కూంబింగ్ చేపట్టారు. టీఎన్ పాలెం సమీపంలోని, ఒక షాపింగ్ మాల్ వెనుక వైపు సోమవారం ఉదయం కొందరు వ్యక్తులు మూడు కార్లలో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ కనిపించారు. దీంతో వారిని చుట్టుముట్టేందుకు ప్రయత్నించగా, ఇద్దరు పారిపోగా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతనిని చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పట్టుబడిన వాటిలో 19 ఎర్రచందనం చెట్ల వేర్లు కాగా, రెండు దుంగలు ఉన్నాయి. మొత్తం 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, కార్లతో సహా తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ వైర్ల అపహరణకు యత్నం



**ప్రజాశక్తి -ఏర్పేడు:** ముసలిపేడు సమీపంలో రైతుల పొలాల్లోని ట్రాన్స్ఫార్మర్ల నుంచి రాగి వైరు అపహరించేందుకు గుర్తు తెలియని వ్యక్తులు కొన్ని బోల్టులు ఊడదీసి వైరు అపహరించేందుకు ప్రయత్నించగా వారి ప్రయత్నం ఫలించకపోవడంతో పొలాల్లోనే ట్రాన్స్ఫార్మర్‌ను వదిలేసి వెళ్లారు. అనంతరం పదిమంది రైతుల మోటారు స్టార్టర్లను అపహరించుకుని వెళ్లడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం



**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు మండల పరిధి, కొమ్మనేటూరు సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి దుకాణాన్ని ఢీ కొన్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. వెంకటగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గూడూరు నుంచి వెంకటగిరికి ప్రయాణికులతో వెళుతుంది. కొమ్మనేటూరు సమీపంలో అకస్మాత్తుగా మోటారు సైకిల్ అడ్డురావడంతో బైక్‌ను తప్పించబోయి బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బస్‌షెల్టర్‌ను, పక్కనే ఉన్న శ్రీనివాసులు అనే వ్యక్తికి చెందిన దుకాణాన్ని ఢీకొని నిలిచిపోయింది. దీంతో బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదని తెలిపారు.

## ఎంపీడీవోకు సత్కారం

**ప్రజాశక్తి - రేణిగుంట :** రేణిగుంట మండల నూతన ఎంపీడీవో రవిచంద్రను సోమవారం ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. మండలంలో ఆషా సంస్థ చేస్తున్న సేవలను నూతన ఎంపీడీవోకి జూలియన్ రాజు వివరించారు. ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ మండలంలో అనుభవం ఉన్న అధికారి ఎంపీడీవో గా రావడం శుభసూచకమన్నారు. ఆషా చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీడీవో తెలిపారని, అందుకు వారికి కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు.

## రిజిస్ట్రేషన్లలో ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలి



**ప్రజాశక్తి - వెంకటగిరి :** ఆస్తుల రిజిస్ట్రేషన్ లలో ఓటీపీ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వెంకటగిరి స్టాంప్ వెండర్స్ అసోసియేషన్ సభ్యులు సురేష్ , శివ, యాకూబ్ భాష, శీను తదితరులు సోమవారం వెంకటగిరి సబ్ రిజిస్టర్ మహబూబ్ బాషా కు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు వారు ఆ సంఘం జిల్లా కమిటీ పిలుపుమేరకు పెన్ డౌన్ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దస్తావేజులను కక్ష దారులే తయారు చేసుకునేలా ప్రభుత్వం తీసుకొచ్చిన విధానంలో ఆధార్ కార్డు ద్వారా ఓటిపి సెల్ ఫోన్‌కు రావడం ద్వారా పలు సమస్యలు ఎదురవుతున్నాయని వారు తెలిపారు. దస్తావేదుకు సంబంధించిన ఓటిపి జనరేట్ అయ్యే లోగా రిజిస్ట్రేషన్ చేసుకుని కక్ష దారుణకు మరొక ఓటిపి రావడంతో అయోమయంకు గురికావాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఓటిపి విధానాన్ని రద్దుచేసి పూర్వపు డేటా ఎంట్రీ పొందపరిచే విధంగా రిజి స్ట్రేషన్లు చేయాలని కోరారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**ప్రజాశక్తి - రామచంద్రపురం:** చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాలెం మండలాలకు సంబంధించిన పలువురికి రూ.27.50 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే కొలువర్తి నాని తెలిపారు. సోమవారం రఘునాథ రిసార్ట్స్, టిడిపి కార్యాలయంలో లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, మేకల తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మహిళ ఒక ఆర్థిక శక్తిగా ఎదగాలి



**ప్రజాశక్తి - రామచంద్రాపురం:** సమాజంలో ప్రతి మహిళ ఒక ఆర్థిక శక్తిగా ఎదగాలని, తిరుపతి జిల్లా డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ టియఎస్ శోభన్ బాబు పేర్కొన్నారు. రామచంద్రాపురం మండలం, సి రామాపురం 1 వ గ్రామ సమైక్యలో సోమవారం వెలుగు ప్రాజెక్ట్, పశువర్ధక శాఖల సమన్వయంతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఈజిపి, పిఎం ఎఫ్ఎంఈ ఋణాల ద్వారా ప్రతి మహిళ 35 శాతం సబ్సిడీ పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపియం గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రోశయ్య సతీమణి మృతికి నివాళి



**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:** స్థానిక మున్సిపాలిటీ గేట్ పుత్తూరు-దాసరి గుంటకు చెందిన టీడీపీ కార్యకర్త రోశయ్య సతీమణి జ్ఞానమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ గేట్ వారి ఇంటికి వెళ్లి ఆమెకు నివాళులర్పించారు.

## గంగరాజుకి ఘన సన్మానం



**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో ఏకైక డైరీ టెక్నాలజీ కళాశాలకు అసోసియేట్ డీన్ గా ప్రొఫెసర్ గంగరాజుని నియమించిన సందర్భంగా ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు ఆధ్వర్యంలో డైరీ ప్రిన్సిపల్ ఛాంబర్లో సోమవారం సత్కరించారు.

## పిజిఆర్ఎస్‌కు 21 వినతులు

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 21 వినతులు వచ్చాయని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. 11 మంది నేరుగా వచ్చి సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందించగా, పది మంది ఫోన్ ద్వారా సమస్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఏసిపి, తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేస్తామని తిరుపతి సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌కు జేఏసీ పిలుపు మేరకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఇంటింటా తిరిగి సర్వేలు చేసే పనిని విముక్తి కల్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 1,25,000 మంది గ్రామ వార్డుసచివాలయ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలు 15 రోజులు పరిష్కరించాలని కోరారు లేని పక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుతంగా ఆందోళన కార్యక్రమం చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రేపు మండల సమావేశం

**ప్రజాశక్తి - బాలాయపల్లి :** వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో బుధవారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వినీల్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల సమావేశంలో తాగు నీటి సమస్యలు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు, వివిధ శాఖల చేపడుతున్న అభివృద్ధి పనుల సమస్యలపై చర్చించనున్నామన్నారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

## కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ - సూపర్ హిట్

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** తిరుపతి, నియోజకవర్గ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్‌ని సోమవారం ఆయన నివాసంలో కలిసి ప్రత్యేకంగా సూపర్ సిక్స్ సూపర్ హిట్ పథకాల సక్సెస్ మెమెంటోని తిరుపతి నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ అందించారు. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ – సూపర్ హిట్ కార్యక్రమం విజయవంతం అయినందున, పేదలకు చేరవలసిన సూపర్ సిక్స్ పథకాలు చేరినందున ఈ మెమెంటోను అందచేశామని మునికృష్ణ తెలియజేశారు.

## రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం




**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** తిరుపతిలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించినట్లు హెూండా మోటార్ సైకిల్ ప్రతినిధి సోమవారం తెలిపారు. హెూండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా తన రోడ్డు భద్రత అవగాహన ప్రచారాన్ని తిరుపతికి తీసుకువచ్చింది. ఈ సందర్భంలో శ్రీ గగన్ హై స్కూల్, శ్రీ విద్యానికేతన్ ఇ.ఎం. హై స్కూల్ మరియు శ్రీ పద్మావతి విద్యానికేతన్ ఇ.ఎం. అండ్ టి.ఎం. హై స్కూల్ విద్యార్థులను భాగస్వామ్యం చేసింది. 2400కి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమం, క్రమబద్ధమైన శిక్షణ మరియు ఇంటరాక్టివ్ లెర్నింగ్ ద్వారా బాధ్యతాయుత రహదారి వినియోగ సంస్కృతిని బలోపేతం చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్తు రైడర్లు మరియు పౌరులను తీర్చిదిద్దడంలో ప్రారంభ దశ విద్య యొక్క ప్రాముఖ్యతను ఈ కార్యక్రమం ప్రత్యేకంగా హైలైట్ చేసింది. విద్యార్థులకు రోడ్డు భద్రతలోని ప్రాక్టికల్ అంశాలను పరిచయం చేశారు .తిరుపతిలో నిర్వహించిన ఈ కార్యక్రమం, రోడ్డు భద్రతా విద్యను సమాజంలో అనేక స్థాయిలలో సమగ్రంగా చేరుస్తున్న హెచ్ఎంఎస్ఐ విస్తృత ప్రయత్నాల్లో ఒక భాగం. ప్రతి చర్య, భద్రతా విద్యను అందుబాటులోకి, అనుభవానికి దగ్గరగా ప్రభావవంతంగా మార్చే హెచ్ఎంఎస్ఐ నిరంతర కృషికి బలం చేకూరుస్తోంది, తద్వారా రవాణాలో బాధ్యతను కేంద్రంగా ఉంచే తరం రూపుదిద్దుతుంది. ఇలాంటి నిరంతర కార్యక్రమాలు రహదారిపై జాగ్రత్తగా చేసే చర్యలు స్వీయ రక్షణకే పరిమితం కాకుండా, చుట్టుపక్కల ఉన్న వారందరి భద్రతకు తోడ్పడతాయని గుర్తు చేస్తాయి.

## అసత్య ప్రచారాలు మానుకోండి



**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** సీఎంను విమర్శించే అర్హత వైసిపి నాయకులకు లేదని, కక్ష సాధింపు చర్యలు కూటమి ప్రభుత్వంలో ఉండవని, వైసీపీ హయాంలోనే అక్రమ కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం జరిగిందని అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ కుమార్ వైసీపీ నాయకులకు హితవు పలికారు. గూడూరు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిల్లకూరు మండలం మోమిడి గ్రామంలో ఆదివారం వైసిపి నాయకులు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఎమ్మెల్సీలు విలేకరుల సమావేశం నిర్వహించి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు భాస్కర్ రెడ్డి, నల్లపురెడ్డి వినోద్ రెడ్డి, బిల్లు చెంచురామయ్య వెంకటేశ్వరరాజు, మట్టం శ్రావణి రెడ్డి, గుండాల లీలావతి, దశరథ రామిరెడ్డి, రహీం, పెంచలయ్య పాల్గొన్నారు.

## ఘనంగా స్కూల్స్ గేమ్స్



**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** తిరుపతి అర్బన్ మండల పరిధిలో 69వ స్కూల్ గేమ్స్ మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ నందు అత్యంత ఘనంగా ప్రారంభమైనయి. ఇందులో భాగంగా సోమవారం వాలీబాల్ అండర్ 14, అండర్ 17 బాల బాలికలు మరియు కబడ్డీ అండర్ 14, అండర్ 17 బాల బాలికలకు క్రీడా పోటీలు మరియు ఎంపికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి పరందామనాయుడు, అతిథిగా డిస్టిక్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ తిరుపతి శశి దర్ హాజరయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎంజీఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి పరంధామనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో బాగా రాణించాలని, ఇష్టమైన అంశాన్ని ఎన్నుకొని ప్రతిరోజు చక్కగా సాధన చేయాలని, క్రీడలు శారీరక మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని, క్రీడలలో గెలుపోటములు సహజమని, క్రీడల్లో పాల్గొనడం ముఖ్యమని, అలాగే చదువులో కూడా బాగా చదివి రాణించాలని తెలిపారు. శశిధర్ మాట్లాడుతూ ప్రభుత్వము క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో మూడు పర్సెంట్ ఉద్యోగాలలో అవకాశం కల్పించిందని, విద్యార్థులు క్రీడల్లో బాగా రాణించి చక్కటి అవకాశాలను ఉపయోగించుకోవాలని, ఈరోజు ఎక్కువ మంది క్రీడాకారులు కబడ్డీ మరియు వాలీబాల్ పోటీల్లో పాల్గొనడం చాలా సంతోషదాయకమని తెలియజేశారు.స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ విద్యాలత మాట్లాడుతూ తిరుపతి అర్బన్ మండలంలోని 400 మంది విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ ,జిల్లా పరిషత్, మున్సిపల్, ప్రైవేటు పాఠశాల నుండి క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు తెలియజేశారు. జరిగినటువంటి మండల స్థాయి వాలీబాల్ మరియు కబడ్డీ పోటీలలో అండర్ 14 అండర్ 17 విభాగాలలో బాలబాలికల జట్టులుగా ప్రకటించడం జరిగినది. వాలీబాల్ అండర్ 14 బాలికలు ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ ప్రథమ విజేతగా నిలిచింది.వాలీబాల్ అండర్ 14 లో బాలికల విభాగంలో ఎంజీఎం హైస్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచింది. అదేవిధంగా అండరు 14 బాలుర విభాగంలో మాలవ్యాజి మున్సిపల్ హై స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచింది ద్వితీయ స్థానం ఎస్ వి క్యాంపస్ స్కూల్ నిలిచింది. అదేవిధంగా అండర్ 17 వాలీబాల్ బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో ఎస్వీ క్యాంపస్ స్కూల్ నిలిచింది. ద్వితీయ స్థానంలో ఎస్ పి జె ఎన్ ఎం మున్సిపల్ హై స్కూల్ నిలిచింది. అండర్ 17 బాలుర విభాగంలో ప్రథమ స్థానంలోని నారాయణ ప్రైవేట్ విద్యాసంస్థ ప్రథమ స్థానంలో నిలచింది. ద్వితీయ స్థానంలో ఎస్ పి జేఎన్ మున్సిపల్ హై స్కూల్ నిలచింది. కబడ్డీ పోటీ లోఅండర్ 14 బాలికలు విభాగంలో మొదటి స్థానాన్ని ఎంజీఎం హైస్కూల్ కైవసం చేసుకున్నది.ద్వితీయ స్థానం గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ కైవసం చేసుకున్నది. కబడ్డీ పోటీలు అండర్ 14 బాలురు ప్రథమ స్థానం ఎస్వీ జయం మున్సిపల్ హై స్కూల్ సాధించింది. ద్వితీయ స్థానం కొర్లగుంట లోని శ్రీవారు హైస్కూల్ సాధించింది. అండర్ 17 కబడ్డీ పోటీల్లో బాలికలు ప్రథమ స్థానాన్ని ఎంజీ హై స్కూల్ సాధించింది. ద్వితీయ స్థానాన్ని . ఎస్ టి వి నగర్ లోని నారాయణ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ సాధించింది. మండల స్థాయిలో జరిగిన పోటీలలో గెలుపొందిన విజేతలు డివిజన్ స్థాయికి ఎంపిక కాబడ్డారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పి విజయకుమారి, ఎం హేమంత్ కుమార్, పి మునయ్య, ఎం ప్రసన్నలక్ష్మి, రాజనర్సింహ, సుధా, మణికంఠ, ఎంజీఎం హై స్కూల్ ఉపాధ్య బృందం తదితరులు పాల్గొన్నారు.

## గిట్టుబాటు ధర కల్పించండి



**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలప దామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నియోజకవర్గంలో పర్యటించి వరి ధాన్యాన్ని పరిశీలించారు. పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని వాపోయారు. రైతులే దేశానికి వెన్నెముక అంటూ గొప్పలు చెప్పడం తప్ప కూటమి ప్రభుత్వానికి రైతులంటే ఏమాత్రం ప్రేమ లేదన్నారు. సురేంద్ర రెడ్డి, ఆంటోనీ, నవీన్, నాగరాజు, మహేష్, సంతోష్, జోసెఫ్, చరణ్, అల్లావుద్దీన్, సారథి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యానికి జగన్ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు

### 17 మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసేందుకు యత్నం : కరుణాకర్ రెడ్డి




**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యా, వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని, పేద విద్యార్థులకు మేలు చేసేందుకు 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తీసుకువచ్చారు, కానీ ఓటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర చేస్తున్నాన్ని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. తిరుపతి పద్మావతి పురం లోని కరుణాకర్ రెడ్డి నివాసములో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలకు మంచి జరగాలనే తత్వం వైఎస్ జగన్మోహన్ రెడ్డిది అన్నారు. నిలోఫర్ హాస్పిటల్ కు మిన్నగా తిరుపతిలో టిటిడి శ్రీపద్మావతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను తీసుకు వచ్చారు. 2021 బ్రహ్మోత్సవాల సందర్భంగా చిన్నపిల్లల హార్ట్ కేర్ సెంటర్ ప్రారంభించారు. 2022 గుండె మార్పిడులు కూడా చేయాలనీ నిర్ణయం తీసుకున్నారు. అపోలో హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి గుండె మార్పిడి పరికరాలు అందుబాటులోకి తెచ్చాం అని తెలిపారు. 2021 అక్టోబర్ 03 నుంచి ఇప్పటికీ వరకు మూడువేల కు పైగా ఓపెన్ హార్ట్ సర్జరీలు , 15 గుండె మార్పిడి ఆపరేషన్లు చేశారు. ప్రారంభించిన ఏడాదిన్నర కాలంలో 15 గుండె మార్పిడులు చేస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలంలో 5 గుండె మార్పిడి ఆపరేషన్లు మాత్రమే చేసారు, ఏడాదిన్నర కాలంలో వెయ్యి ఆపరేషన్లు కూడా పూర్తి చేయలేదని తెలిపారు. 80 శాతం పైగా శ్రీపద్మావతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు తిరుపతిలో పూర్తి అయ్యాయి. అత్యాధునిక సౌకర్యాలతో హాస్పిటల్ నిర్మాణం జరిగింది, 20 శాతం పనులు ఏడాదిన్నర కాలంలో పూర్తి చేయలేక పోయారని విమర్శించారు. 15 విభాగాలుతో శ్రీపద్మావతి చిల్డ్రన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అత్యాధునిక హాస్పిటల్ నిర్మాణం, రాయలసీమకి తలమానికమైన స్విమ్స్ ఆసుపత్రి కు 200 కోట్లు తో మూడు దశల్లో పనులు చేపట్టాం, క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణం, పీజీ హాస్టల్ భవనం, రుయాలో డయాగ్నోసిస్ బ్లాక్ వంటి నూతన భవనాలు నిర్మించాం, న్యూరాలజీ, కార్డియాలజీ బ్లాక్ నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి అనే గుర్తు చేశారు. 80 కోట్లతో స్విమ్స్ హాస్పిటల్ ఐపి బ్లాక్ నిర్మాణం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో చేశాం, ప్రస్తుత టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు స్విమ్స్ ఆధునీకరణ అవసరం లేదన్నారు. 18 కోట్లతో ప్రారంభించిన శ్రీపద్మావతి కాలేజీల హాస్టల్ బ్లాక్ పనులు నిలిపి కూడా వేసింది. జగన్మోహన్ రెడ్డి పాలన్లో 3 వేల మంది చిన్నారులకు శ్రీపద్మావతి హార్ట్ కేర్ సెంటర్ ద్వారా పునర్జన్మ ఇచ్చారు. టిటిడిపై భారం పడ కుండా తిరుమల శ్రీవారి ఉదయస్తమాన సేవలకు కోటి రూపాయలు దానం ఇచ్చిన నిధులు 350 కోట్లుతో హాస్పిటల్ నిర్మాణం చేపట్టం, శుక్రవారం కోటిన్నర, మిగిలిన రోజుల్లో కోటి రూపాయలు నిధులుతో శ్రీపద్మావతి చిల్డ్రన్ సూపర్ స్పెషాలిటీ కు నిధులు దాతలు విరాళంగా ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులకు నిధులను విడుదల చేసి, ఆ నిర్మాణాల త్వరగా పూర్తిచేసి పేద ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో తిరుపతి నగరమేర్ డాక్టర్ శిరీష, ఉదయ వంశీ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం

### ఉత్సవాల నిర్వహణ కమిటీ సమావేశంలో మోహిత్ రెడ్డి



**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని, దేవ దేవునికి ఏలోటు లేకుండా ఉత్సవాలు నిర్వహించడంలో మీరంతా భాగస్వామ్యం కావాలని తుడా మాజీ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వెల్లడించారు. ఉత్సవాల నిర్వహణ, జరుగుతున్న ఏర్పాట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించేందుకు సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నందున ఉత్సవాల నిర్వహణకు చంద్రగిరి నియోజకవర్గంలోని పార్టీ నేతలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయం ఏర్పాటైనప్పటి నుంచి తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దగ్గరుండి ఉత్సవాలు నిర్వహించేవారని, ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి జైలులో నిర్బంధించడం వల్ల ఆ బాధ్యతను అందరూ పంచుకోవాలన్నారు. ఆ మాటకు పార్టీ ముఖ్యనేతలు స్పందిస్తూ భాస్కర్ అన్న బాధ్యతను పంచుకోవడానికి తాము సిద్ధంగా వున్నామని, బ్రహ్మోత్సవాల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి అండగా నిలబడి భక్తులకు, భగవంతునికి ఏలోటు లేకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. బ్రహ్మోత్సవాలకు పల్లెల నుంచి తీసుకురావాల్సిన సారె విషయంలో కూడా ఎక్కడా లోటు లేకుండా చూసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆరు మండలాల నుంచి హాజరైన ముఖ్యనేతలు అందరికీ బ్రహ్మోత్సవ ఆహ్వానం పలికారు.

#### ఆలయ సిబ్బందితో సమావేశం


బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఆలయ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమైన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, కళాకారులు, భజన బృందాలతో పాటు వాహనాలకు అవసరమైన పువ్వులు, విద్యుత్తు దీపాలు, ఆలయం లోపల చేయాల్సిన అలంకరణ వంటి అంశాలపై చర్చించారు. ఉత్సవాల్లో వైదిక క్రతువులను ఆగమోక్తంగా చేసేందుకు గతంలో ఉత్సవాలు నిర్వహించిన అర్చకస్వాములు, వేదపండితులను తీసుకు రావడం, భక్తులకు పంపిణీ చేయనున్న అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించి నిర్ణయం తీసుకున్నారు. గత బ్రహ్మోత్సవాలకు ఏ మాత్రం తగ్గకుండా అన్ని రకాలుగా విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లును పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో చెవిరెడ్డి లక్ష్మీ, ఆలయ ఈవో సుబ్బరామిరెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలతో పాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాల భద్రతపై అధికారుల ఫోకస్

### కట్టుదిట్టంగా ఏర్పాట్లు : అదనపు ఈఓ వెంకయ్య చౌదరి



**ప్రజాశక్తి - తిరుమల:** ఈ నెల 24 నుంచి అక్టోబర్ 2 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. దీంతో భక్తులభద్రతపై టీటీడీ దృష్టి పెట్టింది. ఈ మేరకు తిరుమల అన్నమయ్య భవన్‌లో టీటీడీ విజిలెన్స్, పోలీసు అధికారులతో తిరుపతి ఎస్పీ ఎల్.సుబ్బరాయుడుతో కలిసి అదనపు ఈవో వెంకయ్య చౌదరి సమన్వయ సమావేశం నిర్వహించారు. భక్తుల భద్రత, రవాణా, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్మెంట్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వెంకయ్య చౌదరి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా రోజుకు 435 బస్సులు నడుస్తాయన్నారు. సుమారు 1.60 లక్షల మంది భక్తులకు పికప్, డ్రాప్ సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వాహనాల పార్కింగ్ కోసం తిరుపతిలో 23 ప్రదేశాలను సిద్ధం చేస్తున్నామన్నారు. మాడ వీధుల్లోని గ్యాలరీల్లో 1.85 లక్షల నుంచి 2 లక్షల వరకు భక్తులు కూర్చునే సదుపాయం ఉందన్నారు. అలాగే అసౌకర్యం కలగకుండా వాహన సేవలను తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 4200 మంది పోలీసులు, 1500 మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా క్రౌడ్ మూవ్‌మెంట్, రద్దీ పాయింట్లను రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తారని చెప్పారు. సీఎంతో పాటు రాజ్యాంగపరమైన అధినేతలు, వీఐపీల రాకపోకలకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు వెంకయ్య చౌదరి చెప్పారు.



టీటీడీ ఈవో
అనిల్ కుమార్ సింఘాల్‌ను
మర్యాద పూర్వకంగా కలిసి
అభినందిస్తున్న
తిరుపతి
ఎస్పీ సుబ్బరాయుడు

## దారి ఆక్రమణపై చర్యలు తీసుకోండి




**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు, శ్రీ సత్య సాయి మందిరానికి వచ్చే దారిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు చేపట్టాలని శ్రీ సత్య సాయి స్పిరిచువల్ సొసైటీ సభ్యులు కోరుతున్నారు. గూడూరు తహశీల్దారుకు ఈ విషయమై సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 36 ఏళ్లుగా గూడూరు, కుమ్మరి వీధి,13/22 ఇంటి నెంబర్ గల మందిరంలో ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. 2003 వ సంవత్సరంలో మందిరానికి ఉత్తర వైపు ఉన్న 20.4 అంకణాలు స్థలం రిజిస్టర్ పత్రం ద్వారా పొంది ఉన్నామని తెలిపారు. ఆ స్థలంలో నార్మాణాలకు కూడా అనుమతి పొందామని, కానీ ఉత్తర వైపున ఉన్న ఉమ్మడి దారిని బండి వెంకట శ్రీధర్ రెడ్డి కుటుంబసభ్యులు ఆక్రమించి మందిరం నిర్మాణ పనులకు ఆటంకం కల్గిస్తున్నారని ఆరోపించారు. దారిలో పోల్స్ నాటి ట్రాక్టర్, ఇతర వాహనాలు రాకుండా ఆటంకం కల్గిస్తున్నారన్నారు. శ్రీధర్ రెడ్డి కుటుంబసభ్యులకు 2010 కోర్టు తీర్పు ప్రకారం కుమ్మరి వీధిలో నుంచి వారి ఇంటికి దారి హక్కు లేదని తెలిపారు. ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని తహశీల్దారును కోరామని తెలిపారు.

## స్వీయ రక్షణ పద్ధతులపై 30 రోజుల శిక్షణా కార్యక్రమం



**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్ర విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ కె .రాణి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో స్వీయ రక్షణ పద్ధతులపై శిక్షణ కార్యక్రమము నెల రోజులు వరకు స్థానిక టీటీడీ బధిరల పాఠశాలలో విద్యార్థినులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. డాక్టర్ కె.రాణి మాట్లాడుతూ స్వీయ రక్షణ ప్రాధాన్యత వివరించారు, మీ కౌమార దశలో ఉన్న బాలికలకు అందులోనూ వికలాంగుల పైన రెండింతల వివక్షత మరియు అణిచివేత గురి అవుతున్నారని, అందువలన స్వీయ రక్షణ పైన శిక్షణఎంతో ఆవశ్యకత ఉందని, ప్రస్తుత రోజుల్లో స్త్రీల పైన జరుగుతున్న రేప్, మర్డర్, కిడ్నాప్స్, ఉమెన్ ట్రాఫికింగ్, ప్రేమ పేరుతో మోసాలు ఇటువంటి అకృత్యాలను ప్రతిఘటించడానికి ఈ స్వీయ రక్షణ నైపుణ్యాలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ఈ స్వీయ రక్షణ శిక్షణ ద్వారా వారిని వారు రక్షించుకోగలుగుతారని అంతేకాకుండా అవగాహన, అప్రమత్తత, ఆత్మవిశ్వాసము కలిగి ఉంటారని భయాన్ని పోగొట్టుకొని వారిలో ధైర్యాన్ని నింపుతుందని వివరించారు. ఈ శిక్షణ ద్వారా శక్తివంతమైన ఆడపిల్లలను తయారుచేసి దేశ పురోగతికి కీలక పాత్ర వహించడానికి సంసిద్ధం చేయాలని వివరించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయనం కేంద్రం వారు ప్రయత్నం చేస్తుందని వివరించారు. శిక్షకుడి రత్నాకర్ మాట్లాడుతూ ఆడపిల్లలు స్వీయ రక్షణకే కాకుండా భవిష్యత్తులో వారు ఉద్యోగాలలో రిజర్వేషన్ పొందే అవకాశం కూడా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో బధిర విద్యార్థినులు, ఉమెన్స్ స్టడీ సెంటర్ ప్రాజెక్ట్ అసిస్టెంట్స్ ప్రీతి, టీటీడీ అధ్యాపకురాలు జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి



**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలను పెంపొందించేలా బోధన జరగాలని మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్ ముని సుబ్రమణ్యంలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని హనుమన్నంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ పాఠశాలల క్లస్టర్ పరిధిలోని ఉపాధ్యాయులకు సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఎఫ్ఏ పరీక్షలు పూర్తయ్యాయని, విద్యార్థులకు అసెస్మెంట్ బుక్స్ ఇచ్చి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్వీయూలో యువతరంగ్ సన్నాహాలు



**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని స్టూడెంట్ వెల్ఫేర్, కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో జరగబోయే 'యువతరంగ్ 2025' పోస్టర్ ను ఇంచార్జీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, ఆంధ్రప్రదేశ్ శాప్ ఛైర్మన్ రవి నాయుడు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు , డైరెక్టర్ ఆచార్య మురళీధర్ , ప్రిన్సిపాల్స్ సోమవారం విసి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఉపకులపతి మాట్లాడుతూ అక్టోబర్ 16,17,18 తేదీలో సర్విసు పరిధిలోని అన్ని డిగ్రీ, పిజి కళాశాల విద్యార్థులకు అంతర్ విశ్వవిద్యాలయాల సాంస్కృతిక పోటీలు నిర్వహించబోతున్నామని, వక్తృత్వం, సంగీతం, నృత్యం, థియేటర్ ఆర్ట్స్ వంటి 10 విభాగాల్లో ప్రతిభావంతులను ఎంపిక చేస్తారని అన్నారు. జోనల్ స్థాయిలో పోటీ తమిళనాడులో హిందూస్థాన్ విశ్వవిద్యాలయంలో, జాతీయ స్థాయిలో ఎంపికలు సత్యభామా విశ్వవిద్యాలయంలో ఉంటాయన్నారు. శాప్ ఛైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి సాంస్కృతిక, క్రీడల ప్రోత్సాహం కోసం తన వంతు కృషి చేస్తున్నానని, త్వరలో మంచి క్రీడా ప్రాంగణాలు, వివిధ కోర్టుల నిర్మాణానికి ఆట స్థలాలను ఎంపిక చేస్తారని తెలియజేశారు. విశ్వవిద్యాలయం పక్షాన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచే సత్తా మన యువతకు ఉందని ,వారికి అవసరమైన కొంత ఆర్థిక సహాయం తమ విభాగం నుంచి అందజేస్తామన్నారు. కల్చరల్ విభాగం డైరెక్టర్ ఆచార్య మురళీధర్, సమన్వయకర్త డా. పత్తిపాటి వివేక్ మాట్లాడుతూ గత సంవత్సరం ఎస్వీయూ దేశంలో ఛాంపియన్ షిప్ కైవసం చేసుకుని ప్రధాని ద్వారా ప్రశ్నింసించబడిందని , ఈ సంవత్సరం దాదాపు 40 కళాశాల నుంచి విద్యార్థులు వందల సంఖ్యలో యువ తరంగ్ – 2025 లో పోటీ పడిపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్యులు పద్మావతి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుబ్బారావు, వరదరాజన్, విజయసారథి రెడ్డి, శంకర్ గణేష్ , కల్చరల్ విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.